ముంచెత్తిన వాన

- నగరంలో స్తంభించిన జనజీవనం
- దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని భారీ వర్షం
- ఎడతెరిపి లేని వర్షంతో కాలువల్లా మారిన ప్రధాన రహదారులు
- ప్రధాన రహదారులపై మోకాలి లోతులో చేరిన నీరు
- జలమయంగా మారిన కాలనీలు
- రోడ్లపై ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు
- ఇంటి నుంచి బయటకు రాలేక ఇబ్బందులు పడిన ప్రజలు



కోబాల్ట్‌పేటలో మోకాలిలోతు వరకు వర్షం నీళ్లు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరాన్ని కనీ, వినీ ఎరుగని రీతిలో వర్షం ముంచెత్తింది. జనజీవనం స్తంభించింది. శుక్రవారం మొదలైన వర్షం శనివారం తెల్లవారుజాము నుంచి ఉధృతంగా మారడంతో నగర ప్రజలు ఇళ్ల నుంచి బయటకు అడుగు పెట్టలేకపోయారు. శనివారం ఉదయమే పాఠశాలలు, కళాశాలలకు బయలుదేరాల్సిన విద్యార్థులు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో ఇళ్లకే పరిమితమయ్యారు. ఏకధాటిగా కురిసిన కుండపోత వర్షంతో వ్యాపార సంస్థలు, కార్యాలయాలకు వెళ్లే వారు ఎక్కడికక్కడ ఆగిపోయారు. గుంటూరు నగరంలో గత దశాబ్దకాలంలో ఎన్నడూ ఇంత భారీస్థాయిలో వర్షం కురిసిన దాఖలాలు లేవు. గుంటూరు నగరంలోని అన్ని ప్రాంతాలు వర్షం ధాటికి విలవిల్లాడాయి. అరండల్‌పేట, బ్రాడీపేట, లక్ష్మీపురం, అమరావతిరోడ్డు, పట్టాభిపురం, ఏటీ అగ్రహారం, హిందూ కళాశాల సెంటర్, చుట్టుగుంట సెంటర్, గుజ్జనగుండ్ల, విద్యానగర్, కొరిటిపాడు, నాజ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, నగరంపాలెంతో పాటు అన్ని ప్రాంతాలు వర్షం కారణంగా నదీ ప్రవాహాన్ని తలపించాయి. ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డు విస్తరణ కారణంగా తవ్విన గోతులు, సైడు కాలువల్లో భారీగా నీరు చేరింది. అదే విధంగా పీకలవాగు ప్రవాహం ఉధృతంగా మారడంతో వాగు పరీవాహక ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అమరావతిరోడ్డులో మోకాలిలోతులో నీరు చేరడంతో పాటు కాలువలు పొంగి ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నాజ్ సెంటర్‌లో రోడ్డు మొత్తం వర్షపు నీటితో నిండిపోయింది. డొంకరోడ్డులో మూడు వంతెనల దిగువుగా వెళ్లేరోడ్డుతో పాటు కంకరగుంట ఆర్‌యూబీ దిగువున వెళ్లే మార్గం భారీ తటాకాన్ని తలపిస్తూ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లోనూ భారీగా వర్షపునీరు చేరింది.

వర్షపునీటితో నిండి పోయిన కోబాల్ట్‌పేట

లక్ష్మీపురం: గుంటూరు నగరంలో పశ్చిమ నియోజక వర్గ పరిధిలోని కోబాల్ట్‌పేట ప్రాంతంలో సైడ్ డ్రైనేజిలలో మురుగు నీరు నిలిచి పోవడంతో వర్షపు నీరు స్థానికేతరుల నివాస గృహాల్లోకి వచ్చి చేరడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోబాల్ట్‌పేట ప్రాంతంలో మొత్తం 1వ లైన్ నుంచి 7వ లైన్ వరకు ఉంటాయి. ఈ ప్రాంతంలోని ఈఎస్‌ఐ ఆసుపత్రి, రైస్ మిల్ ఉన్నాయి. ప్రధానంగా ఈ ప్రాంతంలో స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ వెనుక భాగం నుంచి కోబాల్ట్‌పేట మీదుగా పీకల వాగు ఉంది. నిత్యం ఈ పీకల వాగులో మురుగు నీరు నిలిచిపోయి ఉండటంతో దోమలు, విషపురుగులతో విషజ్వరాల బారిన పడుతున్నారు.

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో కురిసిన భారీ వర్షానికి నగరంలోని పలు ప్రాంతాల్లో నీట మునిగాయి. ముఖ్యంగా పాత జీఎంసీ రేకుల షెడ్డు వద్ద నీరు నడుములోతు చేరాయి. ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో ఇళ్లల్లో ఉండలేక, బయటకు వెళ్లలేక ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు.



కోబాల్టుపేటలో ఓ ఇంట్లో చేరిన వర్షంనీరు



ఇళ్లల్లోకి నీరు చేరడంతో బయటికి వస్తున్న వృద్ధులు



బ్రాడీపేటలో జలాశయమైన రోడ్డు

నీట మునిగిన ఇళ్లు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- లోఓల్టేజీతో స్థానికులకు ఇక్కట్లు
- వర్షం ఉధృతికి ఉప్పొంగిన పీకలవాగు

నగరంపాలెం: గుంటూరు నగరంలో శనివారం ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఎటు చూసిన ఇళ్లు, ప్రధాన రహదారులు, గల్లీలు వర్షపు నీటితో నిండాయి. దీంతో స్థానిక ప్రజలు అల్లాడిపోయారు. లక్ష్మీపురం వద్ద మొదలయ్యే పీకల వాగు డ్రెయినేజీ ఉధృతిగా ప్రవహించింది. పీకలవాగుకి అనుసంధానంగా ఉన్న పరిసర ప్రాంతాలు నీటమునిగాయి. ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరుని బయట పోసేందుకు నానా ఆగచాట్లకు గురయ్యారు. చాలా వరకు నివాస గృహాల్లోకి నీరు చేరడంతో డాబాలపైకి ఎక్కి, తలదాచుకున్నారు. మహిళలు, చిన్నారులు బిక్కు బిక్కుమంటూ గడిపారు. ప్రధాన రహదారులు మొదలుకుని గల్లీలన్నీ నడుము లోతు వర్షం నీటితో మునిగాయి. ఇళ్ల ముందు నిలుపుదల చేసిన



మోటారుసైకిళ్లు, ఆటోలు సగానికిపైగా మునిగిపో వడంతో చోదకులు అవస్థలు పడ్డారు. వాహనాలు మొరాయించాయి. దీనికితోడు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గంటల కొద్ది చీకట్లోనే నీళ్లను ఎత్తిపోసుకున్నారు. కోబాల్ట్‌పేట ఏడెనిమిది వీధుల్లో లోఓల్టేజీ సమస్య నెలకొంది. ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు తక్కువ లోఓల్టేజీతో నెలకొన్నాయి. టీవీలు మొరాయించాయి.



పీకల వాగు ఉధృతితో ఇళ్ల మధ్య నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



నగరపాలక సంస్థ కార్యాలయాన్ని చుట్టుముట్టిన వరదనీరు

అంధకారంలో పలు కాలనీలు

నగరంపాలెం: గుంటూరు నగరంలో శనివారం కురిసిన కుండపోత వర్షానికి నవభారత్‌నగర్, శ్యామలానగర్, అమరావతి రోడ్డు, ఆటోనగర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్లలోకి వర్షంనీరు చేరింది. దీంతో పాండు రంగానగర్, వెంగళనగర్, అమరావతి రోడ్డు, కాకుమానివారి తోట, ఒమెగా ఆస్పత్రి, సీతారాంనగర్‌లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చంద్రమౌళినగర్ పోస్టాఫీస్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ పడిపోవడంతో విద్యుత్ మరమ్మతులు చేపట్టారు. ఇక బ్రాడిపేట, లక్ష్మీపురం, తదితర కాలనీల్లోని బహుళ అంతస్తుల్లోకి వర్షం నీరు చేరడంతో ప్లాట్ నిర్వాహకుల సూచన మేరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. భారత్‌పేట, పోస్టల్‌కాలనీ, శ్రీనగర్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడటంతో విద్యుత్ వినియోగదారులు నానా ఆగచాట్లకు గురయ్యారు. దీంతో పగటి వేళ కూడా చీకట్లో గడపాల్సి వచ్చిందని వాపోయారు. పలుమార్లు స్థానిక ఏఈ, లైన్‌మ్యాన్‌కు ఫోన్లు చేసిన స్పందించలేదని వాపోయారు. కోబాల్టుపేట ఏడో వీధిలోని చాలా నివాస గృహాల్లో లోఓల్టేజీ సమస్య ఏర్పడిందని స్థానికులు తెలిపారు. దీంతో ఎలక్ట్రానిక్ వస్తువులు పేలుతాయోనని భయాందోళనకు గురయ్యారు.

విద్యుత్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి

విద్యుత్తు వినియోగదారులు కనీస జాగ్రత్తలు వహించాలని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. తడిసిన విద్యుత్ స్తంభాలను, తడి చేతుల్తో మోటార్లు, విద్యుత్ తీగలను తగిలే చెట్లను పట్టుకోవద్దని అన్నారు. ఇళ్లలోని స్విచ్ బోర్డులను తడి చేతుల్తో పట్టుకోవద్దని, చిన్న పిల్లలను ఎలక్ట్రానిక్ వస్తువులకు దూరంగా ఉంచాలని తెలిపారు. ఇంట్లోని వాటర్ హీటర్లను స్విచ్ ఆఫ్ చేశాక ప్లగ్‌లు తీయాలని చెప్పారు. టీవీ, ఫ్రిజ్, కంప్యూటర్ల స్విచ్‌ఆఫ్ చేయాలని, లేనిచో వైర్లు షార్ట్ సర్క్యూట్ అవుతాయని అన్నారు. విద్యుత్ తీగల కింద సెల్‌ఫోన్ మాట్లాడవద్దని సూచించారు. ఇళ్లల్లోకి వచ్చే సర్వీస్ తీగలకు తెగితే సంబంధిత అధికారి జేఎల్‌ఎం, ఏఎల్‌ఎం, ఎల్‌ఎం, లేదా ఏఈ దృష్టికి తేవాలని తెలిపారు.

లోతట్టు ప్రాంతాల్లో సహాయక శిబిరాలు

నెహ్రూనగర్: నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం సహాయక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలసి నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొన్నూరు రోడ్డు ఆంధ్ర ముస్లిం కాలేజీ, పాతగుంటూరు యాదవ హై స్కూల్, లీలా మహల్ దగ్గర ఉన్న ప్రభుత్వ హై స్కూల్, పొన్నూరు రోడ్డు అంజుమన్ స్కూల్, ఇశ్రాయేల్ పేట బొర్రా నాగేశ్వరరావు స్కూల్, నందివెలుగురోడ్డు వినోభానగర్ స్కూల్, సంజీవయ్యనగర్ పి.ప్రభుదాస్ హైస్కూల్‌లలో సహాయక శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శిబిరాల్లో భోజనం, తాగునీరు, విద్యుత్ ఏర్పాటు చేయాలని ఎస్‌ఈని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అందుబాటులోని శిబిరాలకు వచ్చేలా అవగహన కల్పించాలని కోరారు.



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే నసీర్

కార్పొరేషన్‌లో భారీగా వర్షం నీరు

నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో పూర్తి నీట మునిగింది. ఎటు చూసిన వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కావడానికి తిప్పలు పడాల్సిన నెలకొంది. కార్పొరేషన్‌లోకి నీరు పెద్ద ఎత్తున రావడంతో కార్యాలయంలో కరెంట్ పోయింది.

పోలీసులు ఆరోగ్యంగా ఉండాలి

నగరంపాలెం: పోలీసులు ఆరోగ్యంగా ఉంటే వారి కుటుంబం, సమాజం బాగుంటుందని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. శనివారం నాజ్ కూడలిలోని ఆంధ్ర ప్రైమ్ ఆస్పత్రిలో పోలీస్ సిబ్బందికి మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల ఆరోగ్యంపై ఆస్పత్రి నిర్వాహకులు చొరవ చూపడం అభినందనీయమని అన్నారు. ఆంధ్ర ప్రైమ్ ఆస్పత్రి చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు వారి ఆరోగ్యం కంటే ప్రజా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని అన్నారు. పోలీసులకు ఏవైనా అనారోగ్య సమస్యలొస్తే కుటుంబ సభ్యులు బాధ పడతారని పేర్కొన్నారు. శిబిరంలో స్క్రీనింగ్ టెస్ట్, ప్రసూతి, గుండె, ఎముకల, కంటి, పల్మోనాలజీ, మధుమేహం, థైరాయిడ్, నరాలు, సాధారణ విభాగాల వైద్యులు పోలీస్ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. మహిళలకు వచ్చే గర్భాశయ, క్యాన్సర్ లక్షణాలపై జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కల్పించారు. మందులు పంపిణీ చేశారు. వైద్యులు అచ్చెంశెట్టి అన్వేష్‌కుమార్, కాసుల సాయిరాజశేఖర్, జల్లేపల్లి తేజస్వి, బడుగు పవన్, చెరుకూరి జగదీష్, అందే కోటివెంకటేశ్వరరావు, మాధవీలత, సీఈఓ పార్థసారథి, జిల్లా ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, డీఎస్పీ శాంతికుమార్ పాల్గొన్నారు.



సిబ్బందికి వైద్య పరీక్షలు, చిత్రంలో జిల్లా ఎస్పీ

స్థలాల ఆక్రమణలపై శ్వేత పత్రం విడుదల చేయాలి

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్
- నగరపాలక సంస్థ బిల్డింగ్ అన్యాక్రాంతం
- ఆ ఉద్యోగులను ఏ అధికారి చెబితే విధుల్లోకి తీసుకున్నారో తేల్చాలి
- వాడీవేడిగా సాగిన ప్రత్యేక కౌన్సిల్ సమావేశం



ఏ అధికారి చెబితే ఉద్యోగులను విధుల్లోకి తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేస్తున్న కార్పొరేటర్లు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని నగరపాలక సంస్థ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని.. వాటి పరిరక్షణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ మధ్య కాలంలో పలు అంశాలపై శ్వేత పత్రాలు విడుదల చేసిందని... ఇందులో భాగంగానే నగరపాలక సంస్థ పరిధిలో ఎన్ని స్థలాలు ఆక్రమణలకు గురైయ్యాయి.. ఎన్ని 25 సంవత్సరాలు లీజు పూర్తయిన షాపులు ఉన్నాయో అధికారులు శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. శనివారం ఉదయం 11.09 గంటలకు కౌన్సిల్ సమావేశం మేయర్ కావటి మనోహర్‌నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. సభ్యుల ప్రతిపాదనలు, కార్పొరేషన్ ప్రియాంబుల్స్ 36 అంశాలల్లో మూడు అంశాలు మినహా అన్నింటికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ లీజు పొడిగింపు అంశాన్ని ప్రస్తుత వాస్తవ పరిస్థితులతో, సభ్యుల ప్రతిపాదనలతో, కోర్టు అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామని మేయర్ కావటి చెప్పారు. దీనికి ఆమోదం కాని తిరస్కరణ చేయడం లేదని పేర్కొన్నారు.

ప్రభుత్వ బిల్డింగ్ అన్యాక్రాంతం

గుంటూరు నగరంలో ఓ శ్మశాన వాటికలో నగరపాలక సంస్థ రూ.60 లక్షలతో బిల్డింగ్ నిర్మించిందని, దానిలో ప్రైవేట్ వ్యక్తులు ఉంటున్నారని దీనిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కార్పొరేటర్ షేక్ రోషన్ అధికారులను ప్రశ్నించారు. దీనిపై స్పందించిన మేయర్ కావటి మనోహర్‌నాయుడు సదరు బిల్డింగ్ అన్యాక్రాంతం అయిందన్న విషయం తన దృష్టికి వచ్చిందని దీనిని వెంటనే స్వాధీనం చేసుకుని తాళాలు వేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను మేయర్ ఆదేశించారు.

రీమోడల్ చేసిన కౌన్సిల్‌లో వర్షపు లీకులు

దాదాపు కోటి రూపాయిలు వెచ్చించి రీ మోడల్ చేసిన కౌన్సిల్‌లో వర్షపు లీకులు ఏర్పడంపై కార్పొరేటర్లు మల్లవరపు రమ్య, ఫర్జానా, బాలాజీ అధికారులను ప్రశ్నించారు. వర్షాల కారణంగా శ్లాబ్ లీకులు ఏర్పడిందని దీనికి తగిన చర్యలు తీసుకుంటామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

కార్పొరేషన్ కార్యాలయం మునిగిపోవడం సిగ్గుచేటు

వర్షాలకు నగరపాలక సంస్థ కార్యాలయం మునిగిపోవడం సిగ్గుచేటని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. తూర్పులో చాలా ప్రాంతాలు నీటమునిగిపోయాయని.. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్పొరేషన్ ఎదురు ఉన్న రోడ్లు ఆర్ అండ్ బీ పరిధిలోకి వస్తుందని, వారితో మాట్లాడి రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటుందని... దీని వలన రోడ్లు నిర్వహణ సమగ్రంగా ఉంటుందన్నారు.

గ్రీవెన్స్ పెట్టిన వాటికి పనులు చేస్తారా?

మానస సరోవరం వద్ద డ్రెయిన్ నిర్మాణ పనులకు రూ.1.99 కోట్లు ఏ ప్రతిపాదికన ప్రియాంబుల్ పెట్టారో చెప్పాలని కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాం ప్రసాద్, కామిరెడ్డి రంగారెడ్డి ప్రశ్నించారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణం ఉన్న నేపథ్యంలో దానిని ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఎవరూ చెబితే ఈ ప్రియాంబుల్ పెట్టారో చెప్పాలని కార్పొరేటర్ రంగారెడ్డి ప్రశ్నించగా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు రావడంతో ప్రియాంబుల్ పెట్టామని చెప్పడంపై మండిపడ్డారు. మేము కూడా రోజు గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేస్తామని మాకు కూడా పనులు చేస్తారా అంటూ అధికారులను ప్రశ్నించారు. మానస సరోవరం వద్ద కాలువలను పూడ్చివేసి సర్వీస్ పాయింట్ ఏర్పాటు చేసుకున్నారని.. సదరు ఆక్రమణలు తొలగిస్తే డ్రెయిన్ వేయాల్సిన అవసరం లేదన్నారు. దీనిపై స్పందించిన మేయర్ సదరు ప్రియాంబుల్ ఆమోదానికి పునఃపరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆ ఉద్యోగులను ఏ అధికారి చెబితే విధుల్లోకి తీసుకున్నారో తేల్చాలి

కౌన్సిల్ ఏర్పడిన తరువాత గత ఏడాది 109 మందిని అనధికారికంగా ఆప్కాస్ పద్ధతిలో విధుల్లోకి తీసుకున్నారని..వారిని ఏ ప్రతిపాదికన, ఏ అధికారి చెబితే విధుల్లోకి తీసుకున్నారో చెప్పాలని గత మూడు కౌన్సిల్‌ల నుంచి ప్రశ్నిస్తున్నప్పటికి అధికారులు స్పందించడం లేదని దీనిపై నిగ్గు తేల్చాలని కార్పొరేటర్లు మర్రి అంజలి, అచ్చాల వెంకటరెడ్డి, మల్లవరపు రమ్య, ఫర్జానా, అజయ్, దూపాటి వంశీ, పూనూరి నాగేశ్వరరావులు తదితరులు ప్రశ్నించారు. వారం రోజుల్లో వారి నియామాకాలకు సంబంధించిన పూర్తి వివరాలను సభ్యులకు తెలియజేస్తామని కమిషనర్ పులి శ్రీనివాసులు హామీ ఇచ్చారు.

జోస్ ఆలుకాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

గుంటూరు మెడికల్: గుంటూరు జోస్ ఆలుకాస్ 60వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 మందికి పైగా రక్తదానం చేసి, రక్తపు బ్యాగులు గుంటూరు జీజీహెచ్‌కు అందించారని జీజీహెచ్ బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.సురేష్‌కుమార్ తెలిపారు. రక్తదానం చేసిన వారిని అభినందించారు. రక్తదానం అనంతరం జీజీహెచ్ వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శివరామకృష్ణ, జోస్ ఆలుకాస్ మెనేజర్ వినోద్, అసిస్టెంట్ మేనేజర్ శివ, టెక్నికల్ సూపర్‌వైజర్ శివశంకర్, పీఆర్వో బాబు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న డాక్టర్ సురేష్‌కుమార్

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

నగరంపాలెం: భర్త అదృశ్యంపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఎం.రామయ్య ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసేవాడు. పనికి వెళ్లిన భర్త ఇంటికి రాకపోవడంతో భార్య అరుణకుమారి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీహెచ్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు



గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ (బీహెచ్) మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సఖి విభాగంలో లీడల్ అడ్వైజర్‌గా వ్యవహరిస్తున్న విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని స్త్రీ, శిశు సంక్షేమ కార్యకలాపాలతో పాటు హెల్ప్‌లైన్ సెంటర్ గురించి వివరించారు. విద్యార్థినులు ఆత్మ విశ్వాసంతో జీవితంలో ముందుకు వెళ్లాలని సూచించారు. డిగ్రీతో చదువు ఆపి వేయకుండా ఉన్నత చదువులు అభ్యసించి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినులు ఫ్యాషన్ షో, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ బీవీ విజయభాస్కర్, కార్యదర్శి చేగు శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కాసల్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాధామాధవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో కురుస్తున్న భారీ వర్షాల వలన ప్రజలు ఇబ్బందులు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఏటీ అగ్రహారం, శాంతినగర్, శ్రీరామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా ఇంజినీరింగ్ అధికారులు మోటార్ల సాయంతో బెయిల్ అవుట్ చేయాలన్నారు. వర్షాలు తగ్గేంత వరకు అధికారులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు చెప్పారు.

నగర పాలక సంస్థ డీసీ- 1గా శ్రీనివాసరావు

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్- 1గా డి. శ్రీనివాసరావును నియమిస్తూ శుక్రవారం రాత్రి ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ డెప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న డి.వెంకటలక్ష్మి డీఎంఏలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మిని రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డాక్టర్ ఉదయ్ శంకర్‌కు సన్మానం



గుంటూరు మెడికల్: అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్(ఆప్త) మహోత్సవాలు ఇటీవల అమెరికాలో వైభవంగా నిర్వహించారు. మహోత్సవాలకు గుంటూరుకు చెందిన అహల్య నర్సింగ్ హోమ్ ఫిజీషియన్, జేరియాట్రీషన్ డాక్టర్ శనక్కాయల ఉదయ్ శంకర్ గెస్ట్ ఆఫ్ హానర్‌గా ఆప్త నిర్వాహకులు ఆహ్వానించారు. డాక్టర్ ఉదయ శంకర్ చేసిన పలు సేవా కార్యక్రమాలను నిర్వాహకులు కొనియాడారు. ఆయన్ను ఘనంగా సత్కరించారు.

ప్రజలను ఆదుకోవాలి

లక్ష్మీపురం: ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాపితంగా వివిధ పంటలు దెబ్బతినడమే కాకుండా పల్లపు ప్రాంతాలన్నీ జలమయమై చెరువులను తలపిస్తున్నాయని ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. బ్రాడిపేటలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

రిటైర్డు పోలీసులకు సన్మానం



నగరంపాలెం: ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులు వారి జీవితాన్ని ఆరోగ్యంగా గడపాలని జిల్లా ఏఎస్పీ వెంకటేశ్వరరావు(సెబ్) అన్నారు. శనివారం ఉద్యోగ విరమణ పొందిన ఎస్‌ఐలు శ్రీరామనారాయణ మూర్తి, ఎ.రవీందర్‌రాజు, ఏఎస్‌ఐ దేవప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ యు.సత్యనారాయణమూర్తిలను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో సత్కరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్, ఆర్‌ఐ వెల్ఫేర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పట్నంబజారు: ఆటో కొని పెట్టలేదని తల్లిదండ్రులపై కోపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. మోతిలాల్‌నగర్‌కు చెందిన షేక్‌సల్మాన్(21) గత కొద్దినెలలుగా తనకు ఆటో ఇప్పించాలంటూ తల్లిదండ్రులను అడుగుతున్నాడు. ఇప్పిస్తామంటూ చెబుతూ వస్తున్నారు. ఆగస్టు 30వ తేదీ రాత్రి ఆటో ఇప్పించకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ ఇంట్లో వారిని బెదిరిస్తూ అర్ధరాత్రి సమయంలో ఫ్యానుకు ఇంట్లో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లే సరికి మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తల్లి షకీలా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నిబద్ధతతో పని చేసిన విజయరత్నకుమార్



గుంటూరు ఎడ్యుకేషన్: వృత్తిలో నిబద్ధతతో పని చేసిన విజయరత్నకుమార్ విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దారని హిందూ కళాశాల పాలకమండలి కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి అన్నారు. శనివారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో హిందీ విభాగాధిపతి డాక్టర్ జి.విజయరత్నకుమార్ ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. కళాశాల అధ్యాపక సంఘ అధ్యక్షుడు డాక్టర్ రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, డాక్టర్ బాలశౌరి, డాక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.